క్లుప్తంగా

ప్రయాణికులతో మర్యాదగా మెలగాలి



మాట్లాడుతున్న డిపో మేనేజర్ శ్రీనివాస్

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపోలోని డ్రైవర్లకు, కండక్టర్లు, ఉద్యోగులకు శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితంగా ఉంటుందని ప్రయాణికులు ఆర్టీసీని ఆదరిస్తున్నారన్నారు. ప్రయాణికులతో మర్యాదగా మెలగాలన్నారు. ఆర్టీసీ ఆదాయం పెరుగుదలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సత్యనారయణ, శ్రీనివాస్, రామచంద్రం తదితరులు ఉన్నారు.

ప్రలోభాలకు లొంగొద్దు



మాట్లాడుతున్న సీడీపీవో ఉమారాణి

ఇల్లంతకుంట: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పదోన్నతుల విషయంలో ప్రలోభాలకు లొంగవద్దని ఐసీడీఎస్ సీడీపీవో ఉమారాణి అన్నారు. మండలంలోని అనంతారంలో మంగళవారం అంగన్‌వాడీ ఆయాల సమావేశం నిర్వహించారు. ఆయాలు సమయపాలన పాటించాలని సీడీపీవో సూచించారు. కందికట్కూర్, ఇల్లంతకుంట, పెద్దలింగాపూర్ అంగన్‌వాడీ సెక్టార్ పరిధిలోని ఆయాలు పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్లు సూర్యకళ, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

కర్షకుల కన్నీరు తుడిచింది బీఆర్ఎస్సే



మాట్లాడుతున్న ఆగయ్య

సిరిసిల్లటౌన్: మెట్ట ప్రాంతమైన సిరిసిల్లలో మండుటెండల్లో సాగు, తాగునీరు అందించి కర్షకుల కన్నీరు తుడిచింది బీఆర్ఎస్ పార్టీయేనని, కాంగ్రెస్ నేతలు తెలుసుకోవాలని జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఇటీవల జిల్లా సందర్శనలో పంటలకు నీరు అందించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధికారులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరినట్లు వెల్లడించారు. దీంతో వారు స్పందించి సాగునీరు అందించారని పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ నేతలు కేటీఆర్‌పై అవాక్కులు, చవాక్కులు మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు ఆకునూరి శంకరయ్య, దిడ్డి రాజు, దార్ల సందీప్, గజభీంకార్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

సిరిసిల్లటౌన్: రాజరాజేశ్వరస్వామి ఆలయంలోని పారిశుద్ధ్య కార్మికుల పనిభారాన్ని తగ్గించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. వేములవాడ దేవస్థాన కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలన్నారు. 8 గంటల పని విధానం అమలు చేస్తూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డులు, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని, నేరుగా దేవస్థానమే జీతాలు చెల్లించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు అజ్జ, వేణు, నాయకులు మీసం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్‌ఫేర్

వేములవాడఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రధానోపాధ్యాయుడు రాజారత్నం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు రవీందర్, జ్యోతి, శ్రీలత, మల్లేశం, కోటేశ్వర్ తదితరులున్నారు.

రెండో రోజూ రిలే దీక్షలు

ఇల్లంతకుంట: రంగనాయక సాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎల్‌ఎం 6 కెనాల్ మిగులు పనులు పూర్తిచేయాలని రెండో రోజు రైతులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవ చూపి కలెక్టర్‌తో మాట్లాడి అసంపూర్తి కాలువ పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు.

క్షేత్రస్థాయి సందర్శన

బోయినపల్లి: పీఎంశ్రీ కింద ఎంపికైన మండలంలోని నర్సింగాపూర్ ఎంపీపీఎస్ విద్యార్థులు మంగళవారం మండలంలోని విలాసాగర్ హైస్కూల్‌ను ఆ పాఠశాల హెచ్‌ఎం గుర్రం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో సందర్శించారు. లైబ్రరీ, సైన్స్‌ల్యాబ్, బాలసభ, క్రీడలు, తాగునీరు, డిజిటల్ తరగతులపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఎంఈవో శ్రవణ్‌కుమార్, విలాసాగర్ హైస్కూల్ హెచ్‌ఎం బొలగం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎం.రాజిరెడ్డి, శోభారాణి, సురేందర్‌రెడ్డి, పీడీ ప్రభాకర్, వొడ్నాల జగన్, తదితరులు ఉన్నారు.

ప్రమాదాలకు నిలయంగా జంక్షన్ !

- కొదురుపాక రౌండ్‌బోర్డు సర్కిల్ వద్ద తరచూ ప్రమాదాలు
- రూ. కోటితో రింగ్ రోడ్డు ఎత్తు పెంచేందుకు అంచనాలు
- నిధులు మంజూరుకాక ఇబ్బంది



కొదురుపాక రౌండ్‌బోర్డు జంక్షన్

బోయినపల్లి: కరీంనగర్–కామారెడ్డి ప్రధాన రహదారిలో మండలంలోని కొదురుపాక ఫోర్‌లేన్ జంక్షన్‌లో రింగ్‌రోడ్డు ఎత్తు పెంచే పనులు నిధులు లేక నిలిచిపోయాయి. రౌండ్‌బోర్డు ఏరియా సర్కిల్ పరిసరాలు డౌన్‌లో ఉండి ముందుకు బ్రిడ్జి, రోడ్డు ఎత్తుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు పలువురు తెలుపుతున్నారు. రౌండ్‌బోర్డు జంక్షన్ పరిసరాల్లో ఎటూ వంద మీటర్ల మీర రోడ్డు ఎత్తు లేపేందకు గాను నిధులు మంజూరుకు సుమారు రూ. కోటి మేర అంచనాలతో ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఏడాదిగా నిధులు మంజూరుకాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మొదట ఫోర్‌లేన్ బ్రిడ్జి నిర్మించినపుడు కొదురుపాక వరకు ఫోర్‌లేన్ రోడ్డు నిర్మించి జంక్షన్‌లో 50 ఫీట్ల డయాతో రౌండ్‌బోర్డు సర్కిల్ ఏర్పాటు చేశారు. రౌండ్‌బోర్డు వద్ద ప్రమాదాలు జరుగుతున్నందున ఈ జంక్షన్‌ను ఇటీవల ఎస్పీ అఖిల్ మహాజన్ బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు.

ప్రమాదాల రౌండ్‌బోర్డు సర్కిల్

కొదురుపాక రౌండ్ బోర్డు సర్కిల్ పరిసరాలు ప్రమాదకరంగా ఉన్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం సర్కిల్ రోడ్డులో కరీంనగర్, సిరిసిల్ల, బోయినపల్లి, కొదురుపాక నాలుగు వైపులా వందలాది వాహనాలు వస్తాయి. రౌండ్ బోర్డు వద్ద సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో పలుసార్లు ప్రమాదాలు జరిగాయి.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- జనవరి 1న మహారాష్ట్ర గచ్చిరోలి జిల్లా వెలుగూర్ గ్రామానికి చెందిన 20 మంది వలస కూలీలు అలుగునూర్ నుంచి వేములవాడ రాజన్న దర్శనానికి టాటా ఏస్ వాహనంలో వెళ్తుండగా కొదురుపాక వద్ద ఆటోబోల్తా పడడంతో కాంత మరాఠి (35) మృతిచెందింది. మరో 19 మంది కూలీలు గాయపడ్డారు.
- జనవరి 3న వేములవాడ రాజన్న దర్శనం అనంతరం ఓ కుటుంబం కారులో కరీంనగర్ వెళ్తూ కొదురుపాక పరిసరాల్లో బైక్‌ను ఢీ కొట్టగా ముగ్గురు గాయపడ్డారు.
- 2024 జులై 12న కొదురుపాక వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఓ గ్రానైట్ బండ లారీ ఢీకొట్టింది. కొన్ని సార్లు కార్లు, తదితర పెద్ద వాహనాలు రౌండ్ బోర్డును ఢీ కొన్న సంఘటనలు ఉన్నాయి.

బ్లాక్ స్పాట్‌గా కొదురుపాక జంక్షన్

కొదురుపాక రౌండ్ బోర్డు పరిసరాల్లో తరచూ ప్రమాదాలు జరగడంతో ఎస్పీ అఖిల్ మహాజన్ ఈ ఏరియాను ప్రమాదాలు జరిగే ప్రదేశం (బ్లాక్ స్పాట్)గా గుర్తించారు. రౌండ్ బోర్డు సర్కిల్ డయా వద్ద పోలీస్ పెట్రోలింగ్ వాహనం, పక్కన కానిస్టేబల్ నిల్చున్న పెద్ద ఫొటోను ఏర్పాటు చేయించారు. వాహనదారుల హెడ్‌లైట్లు ఫొటోపై పడగానే రేడియం స్టిక్కర్లు మెరిసి వాహనదారులు నెమ్మదిగా వెళ్లేందుకు కొంతమేర ఉపయోగపడుతోంది.

జంక్షన్ అభివృద్ధి చేయాలి



కొదురుపాక ఫోర్‌లేన్ జంక్షన్‌లో ఉన్న రౌండ్‌బోర్డు సర్కిల్ అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ప్రమాదాల నివారణకు రక్షణ చర్యలు చేపట్టాలి. అలాగే రౌండ్ బోర్డు సర్కిల్ సుందరీకరణ పనులకు కావాల్సిన నిధులు మంజూరు చేయాలి. – కొనుకటి హరీశ్, నీలోజిపల్లి

సుందరీకరణ చేపట్టాలి



కరీంనగర్–సిరిసిల్ల రోడ్డు మధ్యలో కొదురుపాక జంక్షన్ రౌండ్‌బోర్డు సుందరీకరణ పనులు చేయాలి. ఇక్కడ వాటర్ ఫాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రయాణికులకు అందమైన ప్రదేశంలా కనిపించేలా రౌండ్‌బోర్డును అధికారులు తీర్చిదిద్దాలి. – తడుక రాజు, కొదురుపాక,

రూ.కోటితో అంచనాలు



కొదురుపాక రౌండ్‌బోర్డు పరిసరాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.కోటి అంచనాలతో ప్రభుత్వానికి నివేదిక పంపాం. నిధులు మంజూరైతే డౌన్‌గా ఉన్న రింగ్‌రోడ్డు పరిసరాల్లో రెండువైపులా రోడ్డు ఎత్తు లేపే పనులు చేపడతాం. రౌండ్ బోర్డు అభివృద్ధి చేస్తాం. – శాంతయ్య, ఆర్‌అండ్‌బీ, డీఈఈ, వేములవాడ



చందుర్తి: మండలంలోని బండపల్లి గ్రామ శివారు ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న ముళ్ల చెట్టు రోడ్డుపై పైకి వంగి ప్రమాదకరంగా ఉంది. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రమాదం జరగకముందే ముళ్ల చెట్టును తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
నవ్యశ్రీ , ఆర్‌అండ్‌బీ ఏఈ చందుర్తి సెల్ నెం: 9392494019

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఇల్లంతకుంట : విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



వీర్నపల్లి : నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఇల్లంతకుంట: మండలంలోని దాచారం హైస్కూల్‌లో మంగళవారం పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ... విద్యార్థులు పదో పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతికప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాణి, ఉపాధ్యాయులు తూముకుంట నరేందర్ రెడ్డి, శ్రీనివాస్, దావీద్, ఆనంద్ కుమార్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ మాట్లాడుతూ.. విద్యార్థులు పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎస్‌ఎంసీ చైర్మన్ నర్సవ్వ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

గంభీరావుపేట: పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం మండలకేంద్రంలో ప్రధాన రహదారిపై బైఠాయించారు. వేతనాలు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి ఆందోళనకు నాయకులు రాచర్ల పార్థసారధిశర్మ, గంట అశోక్, చేపూరి ప్రభాకర్, కోడె రమేశ్, రాగిశెట్టి నారాయణ మద్దతు పలికారు. ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలి

ముస్తాబాద్: రామలక్ష్మణపల్లె మానేరు వాగునుంచి ఇసుక రవాణాకు అవకాశం ఇవ్వాలని ట్రాక్టర్ల యజమానులు మంగళవారం నాయబ్ తహసీల్దార్ భూపేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆవునూర్, రామలక్ష్మణపల్లె, తుర్కపల్లె గ్రామాలకు చెందిన ట్రాక్టర్లకు మాత్రమే అనుమతులు ఇవ్వడం సరికాదని మాజీ సర్పంచ్ కాంపెల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. అన్నిగ్రామాల్లని ట్రాక్టర్ల యజమానులకు నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వాలన్నారు. ట్రాక్టర్ల యజమానులు రంజిత్, భూమయ్య, రాజనర్సు, శ్రీకాంత్, కిషన్, ఈశ్వర్, ఎల్లం, నరేశ్, భూమరాజ్, రాజశేఖర్ తదితరులున్నారు.



నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ట్రాక్టర్ల యజమానులు

పాఠశాలల తనిఖీ

వీర్నపల్లి: మండలంలోని పలు పాఠశాలలను మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్ మంగళవారం తనిఖీ చేశారు. అడవిపదిర, లాల్‌సింగ్‌తండా, గర్జనపల్లి, బంగిరెడ్డి తండా, గర్జనపల్లి తండా ప్రాథమిక పాఠశాలలతో పాటు గర్జనపల్లి ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం గర్జనపల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.2



గర్జనపల్లిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మండల విద్యాధికారి శ్రీనివాస్

గుడుంబా స్థావరాలపై దాడులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలు తండాల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. నాటుసారా, బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కిష్టునాయక్‌తండా, బుగ్గరాజేశ్వరతండా, అల్మాస్‌పూర్‌తండాలపై దాడులు చేసి 10 కిలోల బెల్లం, 30 లీటర్ల నాటుసారా, 50 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ముగ్గురిపై కేసులు నమోదు చేశామన్నారు. ఒకరిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. అనంతరం టాస్క్ ఫోర్స్ ఎస్సై శైలజ ఆధ్వర్యంలో మండలకేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లిలోని కిరాణ దుకాణా లు, సూపర్‌మార్కెట్లపై దాడులు చేసి బెల్లం నిల్వలపై ఆరాతీశారు. కొన్ని దుకాణాల్లో బెల్లంను స్వాధీనం చేసుకున్నారు. సిబ్బంది రాజు, మల్లేశ్, యోగివర్మ, సుమన్, రాకేశ్ ఉన్నారు.

అనుమానితుడిని చితకబాది పోలీసులకు అప్పగింత

వేములవాడఅర్బన్: పట్టణంలోని జాతర గ్రౌండ్ సమీపంలోని ఓ వ్యక్తి చోరీకి యత్నించాడు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఇంటి యజమాని గేటుకు తాళంవేసి ఇంట్లో నిద్రిస్తున్నారు. అయితే ఎవరూ లేరు అనుకొని గోడ దూకి తలుపును కొడుతుండగా ఇంట్లో యజమాని బయటికి వచ్చి చూడగా తప్పించుకునేందుకు యత్నించాడు. దీంతో కాలనీవాసుల సాయంతో అనుమానితుడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసులు అనుమానితుడి అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

డ్రాఫ్ట్ వేతనాల జీవో సవరించాలి

సిరిసిల్లటౌన్: షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ డ్రాఫ్ట్ వేతనాల జీవోను సవరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. కార్మికుల సమస్యలపై మంగళవారం ఏఎల్‌వోకు వినతిపత్రం అందించి మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు నిర్ణయించాలని కోరారు. ప్రభుత్వం 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాల డ్రాఫ్ట్ జీవోలను పెట్టుబడిదారులకు, యజమాన్యాలకు అనుకూలంగా సవరించడం జరిగిందని విమర్శించారు. దీంతో పరిశ్రమలలో ఉపాధి పొందుతున్న వారందరూ తీవ్రంగా నష్టపోవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ సహాయ కార్యదర్శి అన్నల్దాస్ గణేశ్, నాయకులు మల్యాల నర్సయ్య, శ్రీనివాస్, రవి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల సందర్శన



కళాశాలను సందర్శించిన విద్యార్థులు

వేములవాడఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ట్విన్నింగ్ స్కూల్ పోగ్రాంలో భాగంగా జిల్లా కేంద్రంలోని నర్సింగ్ కళాశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహిస్తున్న ల్యాబ్, తరగతి గదులు, వసతి గదులు పరిశీలించారు. పదో తరగతి అనంతరం ఎంచుకునే కోర్సులను వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజరత్నం, ఉపాధ్యాయులు కోటేశ్వర్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

కళాశాలలో సృజనటెక్ ఫెస్ట్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రభాకరాచారి

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీరాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పాలిటెక్నిక్ సృజన టెక్ ఫెస్ట్– 2025 నిర్వహించారు. కోరుట్ల, హుస్నాబాద్, అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రభాకరాచారి మాట్లాడుతూ, విద్యార్థుల సృజనాత్మకతలను వెలికి తీయడానికి ఈ కార్యక్రమం చేటపట్టడం జరిగిందన్నారు. అగ్రహారం కళాశాల విద్యార్థి బి.సాయికృష్ణ బృందం ప్రదర్శించిన ఎస్ఎస్ ప్రో వైర్‌లెస్ ఎలక్ట్రికల్ వెహికిల్ చార్జర్ ప్రాజెక్టును రాష్ట్రస్థాయి సృజన టెక్ ఫెస్ట్ కార్యక్రమానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. అధ్యాపకులు రాజు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మార్కెట్‌లో పెట్టుబడులపై ఆన్‌లైన్ వెబినార్

గంభీరావుపేట: గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కామర్స్ విభాగం ఆధ్వర్యంలో క్యాపిటల్ మార్కెట్‌లో పెట్టుబడులు అనే అంశంపై మంగళవారం ఆన్‌లైన్ వెబినార్ నిర్వహించారు. ఖాతాలు తెరవడం, సెక్యూరిటీల కొనుగోలు, అమ్మకాలు, ఆదాయం పొందే విధానం గురించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ ప్ర భాకర్, కామర్స్ విభాగం అధ్యాపకులు జగన్నా థం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి

సిరిసిల్ల: జిల్లాలో క్షేత్రస్థాయిలో వడదెబ్బ నివారణ చర్యలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని డీఎంహెచ్‌వో ఎస్.రజిత కోరారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆఫీస్‌లో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వాతావరణంలో వచ్చిన మార్పులు, ఎండాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గ్లూకోస్ బాటిల్స్(సెలైన్) అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ అనిత, వైద్యులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

సిరిసిల్లలో ప్రైవేటు స్కానింగ్ సెంటర్లను స్పెషల్ డ్రైవ్ కమిటీ సభ్యులు మంగళవారం తనిఖీ చేశారు. గర్భిణుల వివరాలు, రెఫరల్ స్లిప్స్ తదితర వివరాలు పరిశీలించారు. ప్రోగ్రాం ఇన్‌చార్జి ఆఫీసర్ డాక్టర్ సంపత్, డాక్టర్ సుమిత్రాలక్ష్మి, ఏఎస్సై ప్రమీల, సఖీ కో ఆర్డినేటర్ రోజా, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రజిత

ఆరోగ్య కేంద్రం తనిఖీ

ఎల్లారెడ్డిపేట: గర్భిణుల నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డీఎంహెచ్‌వో రజిత అన్నారు. రాచర్లబొప్పాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మాతా శిశు ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల వైద్యాధికారి సారియా తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలుచేయాలి

వేములవాడఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం హామీలు అమలు చేయాలని కళాకారుల సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. మంగళవారం వేములవాడ రాజన్న, బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శనం చేసుకొని పోస్ట్ కార్డులతో ర్యాలీగా వెళ్లి పోస్టఆఫీస్ వద్ద బాక్స్‌లకు పూలదండ వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కళాకారుల రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి మాట్లాడుతూ, కాంగ్రెస్ మెనిఫెస్టోలో పెట్టిన విధంగా కళాకారులకు 250 గజాల స్థలం అందించాలన్నారు. ఉద్యమ సారథులుగా గుర్తించి నెలకు రూ.25 వేలు గౌరవ వేతనం తదితర హామీలు అమలుచేయాలన్నారు. ఈ నెల 9న హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై అంబేద్కర్ విగ్రహం వద్ద మిలియన్ మార్చ్ స్ఫూర్తి ప్రతిజ్ఞ దివస్ కార్యక్రమంలో కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బొడ్డు రాములు, ఆంజనేయులు, వారాల దేవయ్య, లక్ష్మీనారాయణ, సంతోష్‌కుమార్, రవి, లచ్చయ్య తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌పై ఆరోపణలు అర్థరహితం

ఎల్లారెడ్డిపేట: రైతులు పంటలు ఎండిపోయి ఆత్మస్థైర్యం కోల్పోతుండగా వారిలో ధైర్యం నింపేందుకు వచ్చిన మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేయడం అర్థరహితమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, మాజీ ఎంపీపీ పిల్లి రేణుక, జిల్లా ఉపాధ్యక్షుడు అందే సుభాష్ అన్నారు. మండలకేంద్రంలో రాజన్నపేటకు చెందిన గుడి చంద్రారెడ్డి పంట ఎండిపోగా రైతుతో కలిసి మాట్లాడారు. దేవునిగుట్టతండాలో సాగుచేసిన పంటలు ఎండిపోయి ఇబ్బందులు పడుతుండగా పరిశీలించేందుకు వచ్చిన కేటీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు ఎంతవరకు సమంజసమన్నారు. సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు కిషన్, నమిలికొండ శ్రీనివాస్, దేవరాజు, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బీజేపీ నాయకుల సంబరాలు

వేములవాడ/వేములవాడ అర్బన్/ముస్తాబాద్/కోనరావుపేట/గంభీరావుపేట/తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/ఇల్లంతకుంట/చందుర్తి/ఇల్లంతకుంట/వీర్నపల్లి : కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి కొమురయ్య విజయంపై వేములవాడలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద పార్టీ శ్రేణులు మంగళవారం పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు.వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం బీజేపీ నాయకులు వేములవాడ నందికమాన్ వద్ద విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ముస్తాబాద్‌లో ఆపార్టీ శ్రేణులు మంగళవారం సంబరాలు నిర్వహించారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. గంభీరావుపేట, కోనరావుపేట, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, చందుర్తి, ఇల్లంతకుంట, వీర్నపల్లి మండలాల్లో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



వేములవాడలో సంబరాల్లో పాల్గొన్న నాయకులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ముస్తాబాద్: ముస్తాబాద్–పోతుగల్ గ్రామాల మధ్య కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోతుగల్‌కు చెందిన దామనవేని కనక, దామనవేని సారవ్వ, గోపి ద్విచక్ర వాహనంపై ముస్తాబాద్‌కు వస్తుండగా, వెనుక నుంచి కారు ఢీకొట్టింది. కనక, సారవ్వ, గోపిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ముస్తాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

సన్మానం

బోయినపల్లి: మల్కాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు లవన్‌కుమార్, శ్రీనివాస్ బదిలీ అయ్యారు. పాఠశాలలో మంగళవారం జరి గిన వీడ్కోలు సమావేశంలో ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు నర్సింహా రెడ్డి, యువజన సంఘాల సమితి జిల్లా నాయకులు తదిత రులు ఉన్నారు.